# చల్లని నీడ

• రచన :
ఎస్. అరవిందా దేవి

[గయ్యాళి అత్త సూటిపోటి మాటలతో నా సున్నితమైన హృదయాన్ని గాయపరచే ఆడపడుచులు, నన్ను మనిషిలా కాక దయ్యంలా చూసే తోటి కోడలు, రూపమే తప్ప హృదయంలేని భర్త వీరందరిమధ్య నలిగిపోతూ నా జీవన యాత్ర సాగించాలని తెలుసుకున్న నేను మొదట భయపడిన మాట వాస్తవం. కాని అలా అని నేను బెదరిపోలేదు. అందుకే జీవితాన్ని ఒక ఛాలెంజీగా తీసుకున్నాను. ఇక చదవండి.]

అప్పుడే కాలేజినుండి రూమ్‌కొచ్చిన నేను గది తాళం తీసి లోనికి నడిచాను. కాలికేదో తగిలితే వంగి దాన్ని చేతిలోకి తీసికొని చూశాను. అది పోస్ట్‌మెన్ తలుపు సందులోంచి లోనికి పడేసిన కవరు. బుక్స్ టేబుల్‌పై పడేసి, తీరిగ్గా సోఫాలో కూర్చుని కవరు విప్పిన నేను క్రింద సంతకం చూస్తూనే పులిక్కిపడ్డాను. ఆ లెటర్ వ్రాసింది ఎవరోకాదు. నా ప్రాణస్నేహితురాలు వసుమ. "అబ్బా, ఎన్నాళ్ళయింది వసుమ ఉత్తరాలు రాయక. ఇన్నాళ్ళకు నేను జ్ఞాపకంవచ్చానన్నమాట. వసుమ నేను చిన్నతనంనుంచి ఎస్.ఎస్.సి. వరకు కలిసి చదువుకున్నాము. ఎస్.ఎస్.సి. మధ్యలో ఆపేసి పెళ్ళిచేసుకుంది వసుమ. అప్పుడప్పుడే పెళ్ళిచేసుకునే ఉద్దేశం లేకపోవడంతో ఎస్.ఎస్.సి. పూర్తిచేసి ఇంకా స్టడీచేస్తునేవున్నాను."

ఆలోచనలకు స్వస్తిచెప్పి ఉత్తరంలోకి దృష్టిసారించాను. వసుమ వ్రాసిన నాలుగు పేజీల లెటర్ చూస్తూనే చదవాలన్న ఆశక్తి ఎక్కువయింది నాలో. అక్షరాలవెంట నా చూపులు పరుగులు తీసినాయ్.

డియర్ వసంతా!

నేను నీకింకా జ్ఞాపకంవున్నానా! ఇన్నాళ్ళకు నేను నీకిలా ఉత్తరం వ్రాయవల్సివస్తుందని కలలోకూడ అనుకోలేదు. "మనిషి అనుకున్నవన్నీ అనుకున్నట్లుగా జరిగితే మానవుడే దేవుడౌతాడంటారు. నిజమేనేమో! ఈ ఒక్క విషయంలోనే కాదు. నా పాతికేళ్ళ జీవితంలో నేను అనుకున్నది అనుకున్నట్లుగా ఏవిషయంలోను జరగలేదు. కారణం ఏమో? నేను చెప్పలేను. లెటర్ పూర్తిగా చదివినతరువాత కారణం నువ్వే నిర్ణయించుకో! ఇక అసలు విషయానికొస్తున్నాను. చదివి నన్నర్థంచేసుకో మరి. "వసుమ పెళ్ళిచేసుకుని హాయిగా కాపురంచేస్తుంది" అని మాత్రమే నీకు తెలుసు. కాని పెళ్ళిచేసుకుని నేను ఎంత హాయి అనుభవించానో నాకు తప్ప ఇంకెవరికి తెలుసు? పసుపు పారాణితో, మదిలో తీయని భావాలతో, ఎన్నో కోరికలతో అందరాడపిల్లల్లాగే నేనుకూడ వివాహం చేసుకుని అత్తింట అడుగుపెట్టాను. అందమైన భర్త, ముచ్చటైన సంసారం, ముద్దులొలికే ముగ్గురు పిల్లలు ఇలా కన్నెగా వున్నపుడు ఎన్నో ఊహించుకున్న నేను, తీరా వివాహ జీవితంలోకి అడుగుపెట్టాక తెలుసుకున్నాను. ఆ అదృష్టం ఏకొందరికోతప్ప అందరిని వరించదని. గయ్యాళి అత్త, సూటిపోటి మాటలతో నా సున్నితమైన హృదయాన్ని గాయపరిచె ఆడపడుచులు, నన్ను మనిషిలాకాక దయ్యంలాచూసే తోటి కోడలు, రూపమేతప్ప హృదయంలేని భర్త వీరందరి మధ్య నలిగిపోతు నా జీవనయాత్ర సాగించాలని తెలుసుకున్న నేను మొదట భయపడినమాట వాస్తవం. కాని వసంతా! అలా అని నేను బెదరిపోలేదు. "జీవితం అంటె వడ్డించిన విస్తరికాదు. ప్రతిమనిషికి జీవితంలో ఎన్నో సమస్యలు ఎదురవుతూనే వుంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని, నిలదొక్కుకోవడంలోనే వుంది ప్రజ్ఞ. అందుకే నేనుకూడ జీవితాన్ని ఒక ఛాలెంజీగా తీసుకో దలుచుకున్నాను. సహనంతో నా దారికి అడ్డువచ్చిన ముళ్ళని ఏరిపారేసి జీవితాన్ని పూలపానుపులా తీర్చి దిద్దుకోవాలనుకున్నాను. ఆ పట్టుదలలోనే ఆరు నెలలు చూస్తుండగానే గడిచిపోయాయి. అప్పుడప్పుడే మెట్టినింట్లో నా స్థానాన్ని నేను నిలబెట్టుకో బోతున్నతరుణంలో మరో షాక్! ఎప్పటిలా ఉదయాన్నే,

నిద్రలేచిన నాకు ప్రక్కన ఆయన కన్పించలేదు. "ఏమిటానికే నిద్రలేవని ఈయన ఇంత ప్రొద్దున్నే ఎక్కడికి వెళ్ళారబ్బా" అనుకుంటూ వారికోసం ఇల్లంతా వెదికానుకాని ఆయనకాని, ఆయన సూట్ కేస్ కాని కన్పించలేదు. గుండెలు రెట్టింపు వేగంతో కొట్టుకుంటుంటే అత్తగార్కి ఈవిషయం చెప్పాను. ఈవిషయం విన్న ఆమె గుండెలు బాదుకుంటూ, దేవుని గదిలోకి వెళ్ళి నగలున్న పెట్టెకోసం వెతికింది. పెట్టె వుందికాని అందులో నగలు లేవు. తాళం పగలగొట్టబడి వుంది. ఈవిషయం విన్న ఇంటిలో వాళ్ళంతా వారివారి వస్తువుల్ని కంగారుగా చూసుకున్నారు. మావగారి జేబులోని ఐదు వందల రూపాయలు, తోటి కోడలి మెడలోని ఒంటి పేట గొలుసు, మరిదిగారి రిస్టువాచీకూడ కన్పించలేదు. వాళ్ళంతా కోపంతో శాపనార్థాలు పెడుతుంటే, నేను చీకటిగదిలో ఓమూల కూర్చుని మౌనంగా రోదిస్తూవుండిపోయాను. భూమి గిర్రున తిరుగుతున్నట్లు, సముద్రం భయంకరంగా వుప్పొంగినట్లు, ఒంటినిండా తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్లు అనుభూతి పొందాను. నా భర్తమీద నాకే అసహ్యం వేసింది. ఒక దొంగకు భార్యగా ఆ ఇంటిలో వుండడానికి నా మనసొప్పలేదు. అయినా వేరే గత్యంతరమేముంది. చిన్నతనంలోనే తల్లిని, తండ్రిని పోగొట్టుకున్న నిర్భాగ్యురాలినైన నన్ను పెంచి పెద్ద చేశాడు తాతయ్య. ఆడపిల్లను పెంచి పెద్దచేయగానే బాధ్యత తీరిపోదు అనుకున్న తాతయ్య ఎంతో కష్టపడి, అప్పులుచేసి నా పెళ్ళి జరిపించాడు. పెళ్ళయిన నెలకే ఈలోకంనుండి శాశ్వతంగా సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు. నాకున్న ఒకేఒక ఆప్తుడైన తాతయ్యను పోగొట్టుకున్న నేను పుట్టింటికి ఏమని వెళ్ళను? ఎవరున్నారని వెళ్ళను? అందుకే నరకమైన, స్వర్గమైన ఆ ఇంటిలోనే వుండాలనుకున్నాను. భర్త వుండగానే ఎన్నో విధాలుగా నన్ను సాధించే. ఆ ఇంటిలోని మనుషులుకాదు పశువులు. నన్ను పురుగుకన్న హీనంగా చూడటం మొదలుపెట్టారు. ఆ ఇంటిలో నా స్థానం పనిమనిషికన్న హీనంగా తయారయింది. అయినా గుండెరాయి చేసుకుని అవన్నీ సహిస్తూవచ్చాను. ఎందుకోసమంటే ఏవేటికైనా నా భర్త తిరిగిరాకపోతాడా! నన్ను తన భార్యగా ఆదరించి, అనురాగాన్ని అందివ్వక

★

విజయా అండ్

సురేష్ కంబైన్స్‌వారి

"సావాసగాళ్ళు"లో

ప్రభ—గిరిబాబు

★



పోతాడా అని. ఆ నిరీక్షణలోనే ఆరు నెలల కాలం భారంగా గడిచిపోయింది. ఆమధ్యకాలంలోనే మా యింటి కెదురుగా అద్దెకుంటే గోపాలంతో నాకు పరిచయ మేర్పడింది. సరదాగా నవ్వుతూ, ఎదుటి వారిని నవ్విస్తూవుండే గోపాలంతో నా పరిచయం రోజురోజుకు పెరిగింది. మా యింటి విషయాలన్నీ ముందుగానే తెలిసివున్న గోపాలం "నీ భర్త తప్పకుండా తిరిగివస్తాడు వసుధ" అని నన్ను ఓదారుస్తుండేవాడు. అతని స్వాంతన వచనాలతో భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురించసాగాయి.

ఆరోజు...గోపాలంతో కాసేపు మాట్లాడి, ప్రశాంతతపొందిన హృదయంతో ఇంటిలోకి వెళ్ళిన నాకు అపరకాళిలా, చిందులువేస్తు ప్రత్యక్షమైంది మా అత్తగారు. "మొగుడు ఇంటిలోంచి వెళ్ళిపోయి ఆరు నెలలయింది. అప్పుడే పరాయి మగవాడితో చాటు భాగోతం సాగిస్తున్నావా? సిగ్గులేదు" అని సణుగుతూ నిలవేసి అడుగుతుంటే ఏమని సమాధానం చెప్పాలి వసంతా? పవిత్రమైన మా ఇద్దరి స్నేహబంధానికి వికృతరూపం కల్పించి, నీచంగా మాట్లాడుతున్న ఆ ఇంటిలోని పశువులను చూస్తుంటే నాకు చెప్పలేనంత అసహ్యంవేసింది. కాని ఏమీచేయలేని నిస్సహాయురాలిని నేను. "నిర్మలమైన స్నేహానికి సరియైన నిర్వచనం తెలియని ఆ మనసులేని కసాయివాళ్ళమధ్య ఒక్క నిముషం నిలవడానికి మనసొప్పలేదు నాకు. కాని ఎక్కడి కెళ్ళాలి? ఎలా బ్రతకాలి? అన్న ప్రశ్నభూతంలా నాకు ఎదురునిల్చింది. ఇలా అంతులేని ఆలోచనలమధ్య కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఇంటిముందు స్కూటరు ఆగిన చప్పుడయింది. స్కూటరుదిగి హుందాగా అడుగులేస్తూ, దొరబాబులా లోనికొస్తున్న ఆయనను చూస్తూనే ఆనందంతో హృదయం పుప్పొంగుతుంటే, సంతోషంతో ఎదురువెళ్ళా లనుకున్నాను. కాని వారి వెనుకగా అతినాజూకుగా అడుగులేస్తు, అత్యాధునికంగా అలంకరించుకొని దాదాపు ఆయనను తాకినట్లుగానే నడుస్తూ లోనికొస్తున్న అందమైన అమ్మాయిని చూస్తూనే నా కాళ్ళకు బ్రేకులుపడ్డట్టుగా సడన్ గా ఆగిపోయాయి. ఇన్నాళ్ళుగానో ఆయనకోసం కన్నులకాచేలా ఎదురు చూసిన నా నిరీక్షణ ఫలితం ఎలావుందో చూశావా వసంతా! పరాయి పురుషునితో మాట్లాడినంత మాత్రాన చెడిపోయిన ఆడదాన్నని నన్ను నిందించిన మా ఇంటిలో వాళ్ళు దొంగతనంచేసి ఇంటిలోంచి వెళ్ళిపోయిన కొడుకు జేబునిండా డబ్బుతో తిరిగిరాగానే ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి ఆదరించారు. "పైగా మగమహారాజు వాడికేమిటి! సిగరెట్టు పీల్చి పారేసినట్టుగా, ఆడదాన్ని అనుభవించి వదిలిపెడతాడు. ఆడవాళ్ళయి పుట్టినందుకు మనము హద్దుల్లో వుండాలి గాని" అంటున్న మా అత్తగారి మాటలు వింటుంటే నాకు ఒళ్ళు మండిపోయింది. "శీలం ఆడదానికైనా, మగవాడికైనా ఒకటే. కాని చేసిన పాపానికి ఫలితం మాత్రం ఆడదాన్నే అనుభవించమని ప్రకృతి శాసించింది. అంతమాత్రాన మగవాడు చెడిపోయినట్లు కాదా?" ఆలోచనలతో మెదడు వేడెక్కిపోయిన నాకు కర్తవ్యం గుర్తుకొచ్చింది. ప్రక్క గది




ఎల్లప్పుడూ

ఒలింపిక్

బ్లూబర్డ్ బనియన్లనే

ఉపయోగించండి.

తయారించువారు :

ఒలింపిక్ నిట్టింగ్ కంపెనీ, తిరుపూరు-638604.

లోంచి ఆ అమ్మాయి మాటలు. వారి నవ్వు వినిపిం చింది. ఆవేశాన్ని అణుచుకోలేని నేను విసురుగా వారి గదిలోకి నడిచాను. హఠాత్తుగా గదిలోకెళ్ళిన నా వంక ఆయన కోపంగా చూస్తూ 'ఏం కావాలి' అని కళ్ళతోనే ప్రశ్నించాడు. అతని నిర్లక్ష్య ధోరణికి ఒళ్ళు మండిపోయిన నేను కోపంగా గొంతువిప్పాను. "ఆరు నెలల క్రితం ఇంటిలోంచి వెళ్ళిపోయిన మీకోసం ఎంతో ఆశతో, ఎన్నో కోరికలతో ఎదురుచూస్తున్న నన్ను మీరిలా అవమానిస్తారా? పైగా మీ గదిలోకి వచ్చిన నన్ను 'ఏం కావాలి' అని ప్రశ్నించడానికి మీకు మనసెలా ఒప్పిందండీ, డబ్బుకోసం మగవాడికి ఒళ్ళు అప్పగించే ఈ మాయలాడి వలలోపడి కట్టుకున్న భార్యకే ద్రోహంచేస్తారా! ఎంత అన్యాయమండి!" అన్న నామాటలు విని వారేమన్నారో తెల్సా వసంతా! "ఈ ఆరు నెలలు నీవు నన్ను తల్చుకుంటూ పతివ్రతలాగా అలాగే మడిగట్టుకుని కూర్చున్నావా, ఆ ఎదు రింటి గోపాలంగాడితో రహస్యంగా సంబంధం పెట్టుకుని కోరిక వాంఛలు తీర్చుకున్న సంగతి అమ్మ చెప్పగా విన్నాను. ఇక నీ నక్క వినయాలు చాలు. ఈరోజు నుంచి నీవు నా భార్యవి కావు. నేను నీ భర్తను కాను, ఈ ఇంటిలో నీకు స్థానంలేదు" అంటున్న ఆయన మాటలు వినలేక రెండు చెవులు మూసుకున్నాను. అతను దొంగ, వ్యభిచారి అయినా ఈ సమాజం అతనిని ఆదరిస్తుంది, గౌరవిస్తుంది.

ఏపాపముచేయని నేను భర్త ఇంటిలోంచి వెళ్ళి పొమ్మంటే ఏదిక్కులేక బజారునపడితే 'మొగడు వదిలేసిన ఆడది' అని ముద్రవేసి హేళనచేస్తారు. అవకాశం దొరికితే ఏ అండలేని ఆడది కదా అని అనుభవించాలని ఎత్తులువేస్తారు. నిజంగా వసంతా "అండలేని ఆడదాన్నిచూస్తే ఈ పురుషుల కెంత లోకువ" కాని కట్టుకున్న భర్తే చెప్పుడు మాటలువిని న్యాయ, అన్యాయాలు విచారించక, ఇంటిలోంచి వెళ్ళి పొమ్మంటే ఇంకా ఆ ఇంటిలో ఎందుకుండాలి? ఎవరి కోసముండాలి, ఆత్మాభిమానం, స్వయం వ్యక్తిత్వం వున్న ఏ ఆడదానికి అంతకంటె అవమానం మరొకటుందా? అందుకే ఆ ఇంటిలోంచి వెళ్ళిపోవ డానికి నిశ్చయించుకున్న నేను కట్టుబట్టలతో గడప దాటాను.

ఎదురింటిలోని గోపాలం గదిలో లైటు వెలుగుతుంది. క్షణంసేపు ఏదో ఆలోచించిన నేను వెళ్ళి గది తలుపులు తట్టాను. తలుపు తెరిచిన గోపాలం అర్ధరాత్రి తన గదికొచ్చిన నన్ను చూస్తూనే ఆశ్చర్యపడ్డాడు. అతని ఆశ్చర్యాన్ని గమనించనట్లే "గోపాలం ఒక స్నేహి తుడిగా నాకొక చిన్న సహాయం చెయ్యగలవా?" అన్నాను దుఃఖాన్ని మునిపంటితో నొక్కి పట్టి. "తప్పకుండా చేస్తాను అడుగు కుసుమా" అన్నాడు గోపాలం ఆత్రంగా.

"ఒక్క పాతిక రూపాయలు నాకివ్వగలవా?" అన్నాను అభిమానాన్ని చంపుకొని అతనివంక చూస్తూ. నా జవాబు విని కొంత అర్థమయినట్లుగా తలపంకించిన గోపాలం నా వంకచూస్తూ "ఇంటిలో ఏం జరిగింది చెప్పు కుసుమా" అని అడుగుతుంటె, దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ జరిగినదంతా చెప్పాను. "చేతిలో నయాపైసాలేదు. పూనావెళ్ళాలంటే కొంతైనా డబ్బు కావాలి. అందుకే... ఒక స్నేహితుడిగా నువ్వు ఆమాత్రం సాయంచెయ్య గలవనే ఉద్దేశంతో నిన్ను అడుగుదామని వచ్చాను" అన్నాను గోపాలం వంక సూటిగా చూడలేక తల వంచుకుని.

ఏదో ఆలోచించిన గోపాలం లేచి పాతిక రూపా యలు నా చేతిలో పెడుతూ "పాతిక రూపాయలు నీ కిచ్చినందుకు ప్రతిఫలంగా నాకు నువ్వొక్క రాత్రి సుఖాన్ని అందివ్వగలవా కుసుమా" అన్నాడు గోపాలం. అతని మాటలు విన్న నేను తలెత్తి "నువ్వు...నువ్వు అలాంటి వాడివేనా" అన్నాను కోపం, దుఃఖం, అవమానం మిళితమైన కంఠంతో. ఆ మాటలకు గోపాలం పకపక నవ్వుతూ "ఎంత అమా యకురాలివి కుసుమా! నేను మాటమాత్రంగా అంటేనే అంతకంగారు పడే నువ్వు బయట అలాంటి లోకుల మధ్య ఎలా బ్రతకగలుగుతావ్, నేనొక్కడిని అలాంటి వాణ్ణి కాకపోవచ్చు. కాని అందరూ నాలాంటివాళ్ళు వుండరుగా.

నీ వచ్చే పాతిక రూపాయలతో నీవు జీవితాంతం బ్రతకగలవా, లేదు. అలాంటప్పుడు నీవు ఏదో [illegible] డబ్బు సంపాదించాలి. నీకు చదువులేదు. [illegible]

గము లేదు. అలాంటప్పుడు నీవు డబ్బెలా సంపాదించ గలవ్? ఆలోచించు కుసుమా. ఆవేశంతో ఇల్లుదాటిన నువ్వు ఇలాంటి సమయంలో ఏంచేయగలవ్" అన్నాడు గోపాలం సూటిగా నావంక చూస్తు.

"అయితే మళ్ళీ ఆ నరకంలోకి వెళ్ళమంటావా? మనసు చంపుకొని ఆ ఇంటిలోకి వెళ్ళేకంటే ఆత్మహత్య చేసుకుంటె వెయ్యిరెట్లు మేలు" అన్న నామాటలకు గోపాలం రెండుక్షణాలాలోచించి తలెత్తి నావంక చూస్తు "కుసుమా! నీవు మరోలా అనుకోనంటే ఒక మాట చెప్తాను. నీ కిష్టమయితే నిన్ను నేను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధంగావున్నాను" అన్నాడు గోపాలం నా మొహంలోకి భావాలను జాగ్రత్తగా గమనిస్తూ.

గోపాలం ప్రశ్నకు మొదట చిత్తరపోయిన నేను అంతలో తేరుకుని "గోపాలం నీ సహృదయానికి నేను హృదయపూర్వకంగా జోహారులర్పిస్తూ, నిన్ను హెచ్చరిస్తున్నాను. కాని మొగుడు వదలేసిన ఆడదాన్నని తెలిసికూడ నన్ను పెళ్ళాడడానికి ముందుకువచ్చిన నీకు ఆతర్వాత అవమానాలేతప్ప సన్మానాలు జరుగవు" అన్న నామాటలకు గోపాలం చిన్నగా నవ్వుతూ "కుసుమా నేను సన్మానాలను ఆశించి నిన్ను పెళ్ళాడ డానికి ముందుకురాలేదు. చెడిపోయిన మగవాడిని క్షమించిన మన సమాజం ఆడదాన్ని క్షమించదు" కాని ప్రతి తప్పుచేసిన ఆడదానివెనుక ఒక మగవాడు వుంటాడన్నది వాస్తవం.

"నేను ప్రేమించింది స్వచ్ఛమైన నీ మనసును కాని నీ శరీరాన్ని కాదు. ఇంతకూ నీ అభిప్రాయమేమిటో చెప్పవేలేదు" అన్నాడు గోపాలం రెండడుగులు ముందుకువేసి, నాకు దగ్గరగావచ్చిన పురుషులంతా నా భర్తలాంటి వాళ్ళే వుండరు. గోపాలంలాంటి సహృదయులుకూడ వుంటారని ఆక్షణంలో అర్ధమయింది నాకు. నన్ను ప్రేమించిన గోపాలంతో కలిసి ఆవూరువిడిచి మద్రాసు వచ్చాను నేను.

గోపాలం నాకు ఖరీదయిన చీరలు, కొనివ్వక పోవచ్చు. ఒంటినిండా బంగారు నగలు పెట్టలేక పోవచ్చు. కాని వాటికన్నా ఎన్నో రెట్లు విలువైన అభ్యాయత, అనురాగాన్ని నాకు సంపూర్ణంగా అందిస్తున్నాడు. ఈ జీవితంలో నాకింతే చాలు, గోపాలంను పెళ్ళాడి జీవితంలో నేనొక చేయరాని నేరంచేశానని నేను అనుకోవటంలేదు. ఇకముందు ఎప్పుడు అనుకోను కూడ. అతని నిర్మలమైన ప్రేమలాలనలో కరిగిపోతున్న నేను గతాన్ని పూర్తిగా మర్చిపోయి, స్వర్గసౌఖ్యాన్ని చవిచూస్తున్నానంటే నమ్ముతావా వసంతా! గోపాలం నాకందించిన 'చల్లనినీడ' లో నా జీవితం యేచింతా లేకుండా, సాఫీగా సాగిపోతుందన్న నమ్మకం నాకుంది. కొందరి దృష్టిలో నేను లేచిపోయిన ఆడదాన్ని కావచ్చు. కాని నన్ను ప్రేమించె గోపాలం నా అండగావుండగా నన్ను లోకమంతా పతిత, కులట అన్నా నేను చిరునవ్వుతో భరించగలను. మరి నానిర్ణయం నీకు సమంజసమైనదే నంటావా? లెటర్ద్వారా తెల్పుతావు కదూ!

ఇట్లు

నీ కుసుమ.

లెటర్ చదవటం పూర్తిచేసిన నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలినాయి. "కుసుమచేసిన సాహసం నిజంగా ఎంతో గొప్పది. దాని నిర్ణయం ఎంతో సమంజసమైంది, సముచితమైందికూడా" అనుకుంటూ కుసుమకు లెటర్ వ్రాయాలని పెన్ను, కాగితం చేతిలోకి తీసుకున్నాను. తృప్తితోకూడిన ఆనందంతో.


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 0-40 పైసలు.

సంవత్సర చందా ... రూ. 7-50.

(రెండు ప్రత్యేక సంచికలతోసహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.